సాక్షి
వరంగల్
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



రెండో విడత ఈవెంట్స్ షురూ..
పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకంలో భాగంగా రెండో విడత దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.
- 8లో



రైల్వే రవాణాకు అంతరాయం
జీబీనగర్ వద్ద బుధవారం గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో వివిధ మార్గాల్లో ప్రయాణించే పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు, కుదింపు చేశారు.
- 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.0^{0}/16.0^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులతోపాటు సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆలయ పనులు త్వరగా పూర్తి చేయాలి



రాయపర్తి: కొలన్‌పల్లి గ్రామంలో చేపట్టిన రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన కలియ తిరుగుతూ నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడున్న వారిని పనుల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జెడ్పీ సీఈఓగా సంపత్‌రావుకు అదనపు బాధ్యతలు

వరంగల్ రూరల్: జెడ్పీ సీఈఓగా డీఆర్‌డీఓ ఎం.సంపత్‌రావుకు బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు డిప్యూటీ సీఈఓ బి.సాహితీమిత్ర నుంచి సంపత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కాగా.. జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది సంపత్‌రావుకు అభినందనలు తెలిపారు. అయితే వ్యక్తిగత సమస్యల వల్ల తాను జెడ్పీ సీఈఓగా కొనసాగలేనని సాహితీమిత్ర కలెక్టర్‌ను అభ్యర్థించారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సంపత్‌రావు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



నర్సంపేట రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాతా, శిశు సంక్షేమ అధికారి డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ హెచ్చరించారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని చట్టప్రకారం నిర్వహించుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బందిపై నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, భాంజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌చంద్ర, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం తనిఖీ



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష శిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. రీడింగ్, ప్రిస్క్రిప్షన్ కంటి అద్దాల పంపిణీ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో క్యాంపు అధికారి డాక్టర్ జి.పల్లవి, సీహెచ్ఓ మధుసూదన్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ మాధవీలత, ప్రతాపగిరి ప్రసాద్, సూపర్‌వైజర్ రామలింగయ్య, గణేశ్, శ్రీలత, ఏఎన్ఎం సులోచన, భవాని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో ప్రథమంగా నిలవాలి

డీఈఓ వాసంతి



కాళోజీ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని డీఈఓ వాసంతి అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమం, మోటివేషన్ తరగతులు, స్నాక్స్ పంపిణీ ఏర్పాట్లను బుధవారం జిల్లా అధికారులు బృందాలుగా ఏర్పడి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ.. వరంగల్, ఖిలా వరంగల్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ మారిన ప్రశ్నపత్రాలను అనుసరించి రాసే సమయంలో స్పష్టంగా ఉండాలని, ప్రతీ ఒక్కరు ఉత్తీర్ణులయ్యే విధంగా మెళకువలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి 10/10 జీపీఏ సాధించేలా బోధించాలని సూచించారు. డీఈఓ వెంట డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎంఈఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిఘా.. నిర్లక్ష్యం!



- ఇది వర్ధన్నపేటలోని ఎస్సీ బాలికల వసతి గృహం. మొత్తం 30 మంది ఐదు నుంచి పదో తరగతి చదివే విద్యార్థినులున్నారు. వీరిలో ఐదుగురు అనారోగ్యంతో ఇంటికెళ్లారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే వీరి బాగోగులు చూడాల్సిన వార్డెన్ మాత్రం బుధవారం వీక్లీ ఆఫ్ కావడంతో అందుబాటులో లేరు. ఇక్కడ ఔట్ సోర్సింగ్ వాచ్‌మెన్ ఈశ్వరమ్మే త్రిపాత్రాభినయం(హెల్పర్, వాచ్‌మన్, కుక్)తో కనిపించింది. హాజరుకు బయోమెట్రిక్ పని చేస్తున్నా.. సీసీ టీవీ కెమెరాలు మాత్రం పని చేయడం లేదు.



- ఇది నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల. 454 మంది విద్యార్థినులుండే పాఠశాలలో భద్రత విషయానికొస్తే సెక్యూరిటీ గార్డు లేడు. ఆ ఆశ్రమంలో ఒకరు నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నా.. అదీ అరకొరే. బాలికల కదలికలను క్యాప్చర్ చేసే సీసీ టీవీ కెమెరాలున్నా అవి పని చేయడం లేదు.

బాలికల హాస్టళ్లలో పనిచేయని నిఘా నేత్రాలు

- వాచ్‌మెన్‌లు లేక ఔట్ సోర్సింగ్‌తోనే నెట్టుకొస్తున్న వైనం
- వర్ధన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాల ఘటనతో తెరపైకి
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో భద్రతా సౌకర్యాలు కరువు



నెక్కొండలోని ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్

సాక్షి, వరంగల్: ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థినుల భద్రత విషయంలో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల భద్రతా చర్యలు పటిష్టంగా లేకపోవడం.. సీసీ టీవీ కెమెరాలు ఉన్నా పనిచేయకపోవడం.. నైట్ వాచ్‌మెన్, సెక్యూరిటీ విధుల్లో అలసత్వం ఆందోళన కలిగిస్తోంది. రాత్రివేళల్లో కొన్ని వసతి గృహాల్లో ఔట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగి ఒక్కరే విధుల్లో ఉండటం.. రెగ్యులర్ ఉద్యోగులు ఇళ్లకు వెళ్తుండటం కనిపిస్తోంది. వీరు వరంగల్, హనుమకొండ నగరాల్లో ఉంటూ వచ్చిపోతున్న ఉదంతాలున్నాయి. వీరిపై ఉన్నతాధికారుల నిఘా లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. వర్ధన్నపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులు కనిపించకుండా పోవడం లాంటి ఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లోనే ఆయా వసతి గృహాల్లో భద్రతా డొల్లతనం బయటకొస్తోంది. ప్రహరీలు లేకపోవడం, రాత్రి సమయాల్లో గేట్‌లకు తాళాలు వేయకపోవడం, తోటి రూమ్‌మేట్‌లు కూడా సహచర విద్యార్థినుల కదలికలు తెలిసినా వార్డెన్లకు చెప్పకపోవడం, కొన్నిసార్లు వార్డెన్ల వ్యవహార శైలి కూడా పిల్లలు పారిపోయే ఆలోచన వచ్చేంతలా చేయడం.. ఇత్యాది కారణాలు భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఒకవేళ ఇలా మిస్సింగ్ అయ్యే పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులవుతారన్న దానిపై స్పష్టత లేకుండా ఉంది.

వర్ధన్నపేట ఆశ్రమ పాఠశాలలోనూ అంతే..

ముగ్గురు బాలికలు కనిపించకుండా పోయిన వర్ధన్నపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలోనూ భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. అక్కడ నైట్ వాచ్‌మెన్ విధులు నిర్వహించకపోవడం, సీసీ టీవీ కెమెరాలు కూడా పని చేయకపోవడంతో అక్కడి సిబ్బంది పనితీరును కళ్ల ముందుంచుతోంది.

దృష్టి సారించాలి...

- సోషల్ వెల్ఫేర్‌లో ఎనిమిది ప్రీ మెట్రిక్(మూడు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు) షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) వసతి గృహాలున్నాయి. వీటిలో ఆరు బాలురు.. రెండు బాలికలకు ఉన్నాయి. నర్సంపేట, వర్ధన్నపేటలో ఉన్న బాలికల వసతి గృహాల్లో భద్రతా చర్యలు మరింత పెంచాలి.
- గిరిజన సంక్షేమ ప్రీ మెట్రిక్ హాస్టళ్లు ఐదు ఉన్నాయి. వీటిలో రెండు బాలురు.. మూడు బాలికలకు ఉన్నాయి. నర్సంపేటలో 321, ఖానాపురంలో 128, నెక్కొండలోని వసతి గృహాల్లో 55 మంది బాలికలు ఉన్నారు. వీటిలో మరింత భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని ఆ శాఖాధికారులు అంటున్నారు.

మైనారిటీ గురుకులాల్లోనూ...

జిల్లాలో మూడు మైనారిటీ గురుకులాలున్నాయి. నర్సంపేటలో నర్సంపేట గర్ల్స్–1, కేయూ క్రాస్ రోడ్డులో వరంగల్ గర్ల్స్–1, శంభునిపేటలో వరంగల్ గర్ల్స్–2 మైనారిటీ గురుకులాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1,200 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక భద్రత విషయానికొస్తే.. నైట్ వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులున్నారు. అయితే శంభునిపేటలో కొద్ది నెలల క్రితం విద్యార్థినుల మధ్య జరిగిన గొడవ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇక్కడ కూడా భద్రతాపరంగా మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

భద్రతా చర్యలపై దృష్టి పెట్టాం..



అన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, మైనారిటీ గురుకులాల్లో భద్రతా చర్యలపై దృష్టి సారించాం. అక్కడ ఏమేమి అవసరం అన్నాయో వాటిపై నివేదిక తయారు చేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. వారిచ్చే నివేదిక ఆధారంగా అక్కడ భద్రతా చర్యలు మరింత పెంచుతాం. విద్యార్థినులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా చూస్తాం.
– బి.గోపి, వరంగల్ కలెక్టర్

ప్రహరీ ఎత్తు పెంచాలి..



నెక్కొండ ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి. హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ లేడు. సీసీ కెమెరాలు కూడా లేవు. ఇతర విద్యార్థులు గోడ దూకి హాస్టల్‌లోకి వచ్చే ప్రమాదం ఉంది. వెంటనే మహిళా వార్డెన్‌ను నియమించాలి.
– గుగులోతు మమత, డిగ్రీ ఫస్టియర్, నెక్కొండ

మాట కలుపుతూ.. హామీలిస్తూ..



మాల్యాతండా శివారులో మిర్చి పంటను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

పాలకుర్తిలో ఉత్సాహంగా సాగిన టీపీసీసీ చీఫ్ రేవంత్ పాదయాత్ర

- అడుగడుగునా ప్రజాసమస్యల వెల్లువ
- బహిరంగ సభలో మంత్రి దయాకర్‌రావు టార్గెట్‌గా ఆరోపణలు



పాలకుర్తి సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

పాలకుర్తి/పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: రైతు కూలీలు, వృత్తిదారులతో మాట కలుపుతూ.. సమస్యలు వింటూ విన్నపాలు స్వీకరిస్తూ.. అధికారంలోకి వచ్చాక అండగా ఉంటామని హామీలిస్తూ.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్ర సాగింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని అంగడి ఏరియాలో బసచేసిన రేవంత్‌రెడ్డికి జిల్లా, నియోజకవర్గ, మండల శ్రేణులు బుధవారం ఘనస్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు దేవరుప్పులలో ప్రారంభమైన పాదయాత్ర కొత్తకాలనీ, గిరిజన తండాలు, ధర్మాపురం, మాల్యాతండా, మైలారం, విస్నూరు, పాలకుర్తి వరకు సాగింది. అడుగడుగునా ప్రజాసమస్యలపై వినతిపత్రాలు వెల్లువెత్తాయి. దేవరుప్పుల కొత్తకాలనీలో గొల్ల కురుమలు గొర్రెపిల్లను, గీత కార్మికులు మోకులను బహుమతిగా ఇచ్చారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్‌చౌదరి కోరిక మేరకు రేవంత్‌రెడ్డి కల్లు రుచిచూసి బాగుందని కితాబిచ్చారు. కొత్తకాలనీలో లొడంగి కొండయ్య అన్నం తింటుండగా పక్కన కూర్చుని పలకరించిన రేవంత్‌రెడ్డి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వివరించారు. పేదలకు అందని ఇళ్లు, నిత్యావసరాలు, వంట గ్యాస్, పెట్రో ధరల పెరుగుదల వైఫల్యాలను ఎండగడుతూ.. హస్తం పార్టీ అధికారంలోకి వస్తే ఇబ్బందులు పోతాయని భరోసా కల్పించారు. దేవరుప్పుల శివారులో పత్తి తీస్తున్న మహిళా రైతు తోటకూరి భద్రమ్మతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. పంటసాగు స్థితిగతులు తెలుసుకున్నారు. ధర్మాపురం శివారులో నిర్మించి పంపిణీ చేయని డబుల్ బెడ్రూం ఇళ్లను రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఓ ఇంటిపై ఉన్న మద్యం బాటిళ్లను చూసి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల తీరు ఇదీ అని విమర్శించారు. సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో భోగ్ బండార్ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మొక్కులు చెల్లించుకొని గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. మాల్యాతండా శివారులో మిర్చి తోటవద్ద రైతులతో ముచ్చటించారు. ధరణితో భూసమస్య పరిష్కారం కావడంలేదని మహిళా రైతు పేర్కొనగా.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ సమస్య ఉండదని చెప్పారు. మిర్చి పంట గిట్టుబాటు కోసం పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ వరాల జల్లులు

కాంగ్రెస్ హయాంలోనే శాశ్వత ప్రాతిపదికన పనులు జరిగాయని, తమ పార్టీ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లు, రూ.2లక్షల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. రూ.500కే వంటగ్యాస్ అందిస్తామని, రూ.5వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పారు.

మంత్రి ఎర్రబెల్లిపై తీవ్ర విమర్శలు

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రలో.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు, ఆరోపణలతో విరుచుకుపడ్డారు. భూఆక్రమణలు చేస్తూ, కమీషన్లు దండుకుంటూ బినామీల పేర ఆస్తులు కూడబెట్టుకుంటున్నాడని అన్నారు. ఇందుకు ఉదాహరణగా.. కంఠాయపాలెంలో భూఆక్రమణలని పేర్కొన్నారు. దేవరుప్పుల వాగులో ఇసుక దందా చేయడానికి చెక్‌డ్యామ్‌లు కట్టారని ఆరోపించారు. కేసీఆర్ దుష్టపాలనను ఎండగట్టి పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావును ఓడిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చినట్లే అవుతుందన్నారు.

లక్ష మెజార్టీతో గెలిపిస్తాం : జంగా

పాలకుర్తి సభలో డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాలకుర్తి నుంచి పోటీ చేస్తే లక్ష మెజార్టీతో గెలిపిస్తామని అనడంతో ప్రజలు చప్పట్లతో స్వాగతం పలికారు. అయితే రేవంత్ మాత్రం స్పందించలేదు. కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్‌చౌదరి, మల్లు రవి, దొమ్మాటి సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ధన్వంతి, సింగారపు ఇందిర, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ది కృష్ణమూర్తి, బల్మూరి వెంకట్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, సంకెపల్లి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు పంటలకు పాకాల నీరు

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: పాకాల ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించనున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కీర్యతండా శివారు దబ్బవాగు వద్ద బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి పాకాల సరస్సులో యాసంగికి సరిపడా నీరు లేకపోవడంతో పాకాల, రామప్ప ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలిస్తున్నట్లు తెలిపారు. పాకాల ప్రాజెక్టు అధికారికంగా పూర్తి కానప్పటికి రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ద్వారా ప్రత్యేక అనుమతులు తీసుకొచ్చి నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాకాల మోటార్లకు ట్రయల్‌రన్ నిర్వహించినప్పటికి ఇంకా ప్రారంభించలేదన్నారు. ప్రస్తుతం రంగాయ చెరువు మోటార్ల ద్వారా రోజూ 15 ఎంసీఎఫ్‌టీల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో కొందరు నాయకులు ఇంట్లో కూర్చుని ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మాయమాటలతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. మంగళవారిపేట పరిధిలోని గిరిజన రైతులకు పోడు పట్టాలు అందించాకే ఓట్లు అడుగుతానన్నారు. ముందుగా నాజీతండాలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కుంచారపు వెంకట్‌రెడ్డి, వేజెళ్ల కిషన్‌రావు,డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్, బూస అశోక్,బందారపు శ్రీనివాస్,వల్లెపు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాయపర్తి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రణాళికతో ముందుకెళ్లాలని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి అన్నారు. పదో తరగతి పరీక్షా విధానంపై కొండూరు కాంప్లెక్స్ పరిధిలోని కొండూరు, తిర్మలాయపల్లి, కొలన్‌పల్లి, కేశవాపురం, కాట్రపల్లి పాఠశాలల్లో బుధవారం ఆయన అవగాహన కల్పించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బుర్ర కవిత, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, అనురాధ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

• బడిలో 'వెలుగు'.. 'ఆవరణ'లో చదువు!



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే.. కానీ.. పాఠశాలలోని తరగతి గదుల్లో కూర్చొని చదువుకోవట్లే.. రెండు రోజులుగా పాఠశాల సమీపంలోని ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో విద్యనభ్యసిస్తున్నారు. కారణం ఏమిటంటే.. కొండాయిల్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అధికారులు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనుండగా.. స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థుల తరగతులను ఓ వ్యక్తి ఇంట్లో నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దీంతో బుధవారం ఇలా విద్యార్థులు ఇంటి ఆవరణలో చదువుతూ కనిపించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొడ్ల నరేష్, మార్త నాగరాజు అక్కడికి వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. - నల్లబెల్లి

పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

58, 59 జీఓ ప్రకారం భూములు క్రమబద్ధీకరించాలి

- పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య



హాజరైన వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు

హన్మకొండ అర్బన్: మున్సిపాలిటీల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాలకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అంశాలపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆయా జిల్లాలకు జీఓ నం.58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను నిబంధనల ప్రకారం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలన్నీ చట్టంలోని ప్రతీ అంశాన్ని పరిశీలించి పాటించాల్సిందేనన్నారు. టీయూఎఫ్ఐడీసీ పథకం కింద ప్రతీ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చేయాలన్నారు. అమృత్, పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, ఎస్‌డీఎఫ్, సీఎం అస్యూరెన్స్ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. పట్టణాల్లో సెంట్రల్ మీడియన్స్, ఫుట్‌పాత్‌లు, వీధి దీపాలు, అంతర్గత రహదారులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, దోబీఘాట్లు, వైకుంఠధామాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స కోట, దివాకర, స్నేహలత, మధుసూదన్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీఓలు వాసుచంద్ర, రాము, మహేందర్ జీ, మున్సిపల్, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ అధికారులు, 16 మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో..

అనంతరం అరవింద్‌కుమార్.. మినీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, డాక్టర్ గోపి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ప్రావీణ్యలతో కలిసి మంచినీటి సరఫరా, ఫ్లడ్ యాక్షన్ ప్లాన్, మినీ స్టేడియాల ఏర్పాటు, కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్ స్టేషన్ నవీకరణ, స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 66 డివిజన్లలో వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరాలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని మెట్రో వాటర్ సప్లై బోర్డు రిటైర్డ్ ఆపరేషన్ డైరెక్టర్ రవికుమార్‌ను ఆదేశించారు.

వరద సమస్య పునరావృతం కావొద్దు..

వరద నివారణ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షిస్తూ.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో స్వల్ప, దీర్ఘకాలిక పనులు చేపట్టాలన్నారు. భద్రకాళి చెరువుకు సంబంధించి పెండింగ్ పనుల పూర్తికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. గ్రేటర్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలన్నారు.

జూన్ 2 నాటికి కాళోజీ కళాక్షేత్రం పూర్తి చేయాలి..

కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో వేగం పెంచి జూన్ 2 నాటికి పూర్తి చేయాలన్నారు. వరంగల్‌లో కొత్త బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్న మాదిరిగానే హనుమకొండ బస్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో చేపట్టిన 62 పనుల్లో ఇప్పటికి 26 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన 36 పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

విజేతలు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, జీపీసీ

విజయవంతంగా ముగిసిన ఎస్‌పీఎల్ రీజినల్ టోర్నీ

- సీనియర్స్, జూనియర్స్‌లో రన్నరప్‌గా వాగ్దేవి, శ్రీచైతన్య జట్లు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు



ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీలో భాగంగా రీజినల్ స్థాయి పోటీలు బుధవారం జరిగాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల, జూనియర్స్ విభాగంలో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లు విజేతగా నిలిచాయి. అలాగే, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రన్నరప్‌గా వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. విజేతలు, రన్నరప్ జట్లకు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయ మూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జావేద్ పాషా ముఖ్యఅతిథులుగా పాల్గొని ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, టీ.వీ. ప్రతినిధి పి.మహేందర్, యాడ్స్ మేనేజర్ ఎన్.శేషు, ఈవెంట్స్ మేనేజర్ బోడపట్ల వేణు, న్యాయ సహాయ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రికెటర్లు జోజిచాకో, ఎం.డీ.ఫారుక్, జీవని, తరుణ్‌తోపాటు సాక్షి ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, రాధారాపు రాజు, ఉపేందర్, ఆసిఫ్, కిరణ్, రాంబాబు, శ్రీనివాసాచారి, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

జూనియర్స్ విజేత వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు

ఎస్‌పీఎల్ రీజియన్ స్థాయి జూనియర్స్ విభాగం మ్యాచ్‌లో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల – ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్లు తలపడగా టాస్ గెలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. జట్టులో రుశాంక్ నాలుగు ఫోర్లతో 29, సాయి వంశీ ఆరు ఫోర్లతో 28 పరుగులు చేయగా, బౌలింగ్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల క్రీడాకారుడు పర్షన్ రెండు, జయంత్, భరత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య జట్టు 12ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 96 పరుగులే చేయగలగడంతో వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల టైటిల్ దక్కించుకుంది. కాగా, శ్రీచైతన్య జట్టు నుంచి విష్ణుష్ 14, గౌతమ్ 12 పరుగులు చేయగా, వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు నుంచి కార్తీక్, శివకుమార్ రెండేసి వికెట్లు, రుశాంక్, సాయివంశీలు ఒక్కో వికెట్ తీసుకున్నారు. తొలుత రీజియన్ స్థాయి పోటీల్లో ఫైనల్స్‌లో స్థానం కోసం నల్లగొండ ఎన్‌సీఎల్ జూనియర్ కళాశాల, ఖమ్మం శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్ల నడుమ మ్యాచ్ జరగగా శ్రీ చైతన్య జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన ఎన్‌సీఎల్ జట్టు పది ఓవర్లలోనే 83 పరుగులే చేసి ఆలౌట్ కావడంతో శ్రీచైతన్య జట్టు విజయం సాధించినట్లయింది.

బౌలింగ్‌లో హ్యాట్రిక్ సాధించిన ఖమ్మం శ్రీచైతన్య కాలేజీ క్రీడాకారుడు గౌతమ్




సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా, సాక్షి ఉద్యోగులు, క్రీడాకారులు




సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రన్నరప్‌గా నిలిచిన వరంగల్ వాగ్దేవి, ఖమ్మం శ్రీచైతన్య జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా, సాక్షి ఉద్యోగులు, క్రీడాకారులు

ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్‌కు సీనియర్స్ టైటిల్

ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల – వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్ల నడుమ సీనియర్స్ విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో టాస్ గెలిచిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వాగ్దేవి జట్టు 12 ఓవర్లలో 66 పరుగులు చేసి ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో సాయి నైనిత్ 14పరుగులు చేయగా, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ బౌలర్లలో అజర్ మూడు ఓవర్లు వేసి ఏడు పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఇక విశాల్‌యాదవ్ రెండు, సాయిచంద్ ఒక వికెట్ తీసుకున్నారు. ఆతర్వాత బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ జట్టు 9.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించి ఆరు వికెట్ల తేడాతో టైటిల్ దక్కించుకుంది. ఈజట్టులో జె.బన్ని మూడు ఫోర్లతో 25, సాయిచంద్ 17, అఖిల్ 14 పరుగులు చేశారు. ఇక వాగ్దేవి జట్టు బౌలర్లలో రియాజ్, సాయినైనిత్, పర్షన్, శ్రీధర్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలుత ఫైనల్స్‌లో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ శాంతినికేతన్ డిగ్రీ కళాశాల, వరంగల్ వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు పరిమిత 12 ఓవర్లలో ఆరు వికెట్లకు 93 పరుగులు చేసింది. ఆతర్వాత శాంతినికేతన్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 12 ఓవర్లలో 65 పరుగులే చేయడంతో వాగ్దేవి జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది.



జూనియర్స్ విభాగంలో ఖమ్మం శ్రీచైతన్య - వరంగల్ పాలిటెక్నిల్ జట్ల నడుమ మ్యాచ్

క్రమశిక్షణ, పట్టుదలతో ఎదగాలి

– ఖమ్మం జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌పీఎల్ రీజినల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలు, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశాక మాట్లాడారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడమే కాక సమసమాజాన్ని స్థాపించేందుకు కృషి చేయాలని సూచించారు. కాగా, 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఇలాంటి టోర్నీలు యువతలో మార్పు తీసుకొచ్చేందుకు ఉపయోగపడతాయని జిల్లా జడ్జి పేర్కొన్నారు.

రెండో విడత ఈవెంట్స్ షురూ..



పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం : పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకంలో భాగంగా రెండో విడత దేహ దారుఢ్య పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బుధవారం పోలీస్ నియామక మండలి నిర్దేశించిన అభ్యర్థులు ఉదయం 5 గంటలకే కాకతీయ విశ్వవిద్యాలయం మైదానానికి చేరుకున్నారు. ముందుగా అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాను అధికారులు పరిశీలించిన అనంతరం బయోమెట్రిక్ తీసుకొని, అభ్యర్థులకు 1,600మీటర్ల పరుగుకు అనుమతించారు. బుధవారం ఈవెంట్స్‌లో మొత్తం 601 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా ఇందులో 447 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 115మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. అభ్యర్థులకు కావాల్సిన సౌకర్యాలను సీపీ పరిశీలించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

నష్టాలు అధికంగా వస్తున్న ఫీడర్లు గుర్తించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు

హన్మకొండ: విద్యుత్ పంపిణీ నష్టాలు అధికంగా వస్తున్న ఫీడర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణానికి అంతరాయం

- పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు, కుదింపు
- కాజీపేట జంక్షన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు
- ఒకవైపు థర్డ్‌లైన్ పనులు, మరోవైపు 'గోదావరి' ఘటన
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



కాజీపేట జంక్షన్‌లో రైళ్ల కోసం వేచిఉన్న ప్రయాణికులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ మార్గంలో బీబీనగర్ వద్ద బుధవారం గోదావరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివిధ మార్గాల్లో ప్రయాణించే పలు రైళ్లను రద్దు, దారి మళ్లింపు, కుదింపు చేశారు. సికింద్రాబాద్–విజయవాడ మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, వరంగల్– హైదరాబాద్ అప్ అండ్ డౌన్ పుష్‌పుల్ ట్రైన్‌ను రద్దు చేశారు. సికింద్రాబాద్– బల్లార్షా వెళ్లే భాగ్యనగర్‌ను కాజీపేట– బలార్షా, సికింద్రాబాద్– గుంటూరు వెళ్లే గోల్కొండను కాజీపేట–గుంటూరు వరకు, మణుగూరు–సికింద్రాబాద్ వెళ్లే కాకతీయను కాజీపేట వరకు, సికింద్రాబాద్ –విజయవాడ వెళ్లే శాతవాహన వరంగల్–విజయవాడ వరకు నడిపిస్తూ మిగితా మార్గంలో రద్దు చేశారు. కోర్బా ఎక్స్‌ప్రెస్, హంసఫర్ ఎక్స్‌ప్రెస్, దానాపూర్ ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లను సికింద్రాబాద్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నారు. రైళ్ల రద్దు, దూరం కుదింపు, దారి మళ్లింపుతో కాజీపేట జంక్షన్ నుంచి సికింద్రాబాద్, బల్లార్షా, విజయవాడ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సికింద్రాబాద్ మార్గంలో ప్రయాణించే కృష్ణ, హౌరా ఎక్స్‌ప్రెస్‌లతో పాటు పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఒకవైపు థర్డ్‌లైన్ పనులు, మరో పక్క 'గోదావరి' ఘటనతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అధికారుల ఆదేశాల మేరకు కాజీపేట జంక్షన్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ తెలిపారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపు, కుదింపుతో తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్న సుమారు 250 మంది ప్రయాణికులకు రిజర్వేషన్, జనరల్ టిక్కెట్ రద్దు చేసి ఫుల్ రిఫండ్ చేసినట్లు రైల్వే సీసీఐ రాజగోపాల్ తెలిపారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ ఘటన సమాచారం అందుకున్న కాజీపేట ఎమర్జెన్సీ బ్రేక్ డౌన్ స్టాఫ్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది హుటాహుటిన ప్రత్యేక రైలులో మెటీరియల్స్‌తో ఘటనా స్థలానికి వెళ్లారు.

ప్రైవేట్ యాజమాన్యాలు సేవాభావంతో చూడాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు రమేష్, ధర్మారెడ్డి, ఎస్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ సంపత్‌రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఆరెపల్లిలో అపోలో ఎస్ఎస్ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

వరంగల్: ప్రైవేట్ యాజమాన్యాలు, వైద్యులు కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో చూడాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ మండలం ఆరెపల్లి సమీపంలోని కొత్తపేట క్రాస్ వద్ద నూతనంగా నిర్మించిన అపోలో ఎస్ఎస్ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావులతో కలసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేలు ఆస్పత్రిలోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎస్ఎస్ఆర్ హాస్పిటల్ యాజమాన్యం అపోలో ఆస్పత్రితో అనుసంధానంకావడంతో స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ నాయినేని సంపత్‌రావు మాట్లాడుతూ.. ఈ హాస్పిటల్స్‌లో అన్ని ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. 24 గంటలు అత్యవసర చికిత్సలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీతరెడ్డి, అపోలో హాస్పిటల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగీతరెడ్డి, ఆస్పత్రి నిర్వాహకులు నాగేశ్వర్‌రావు, కళింగరావు, కార్పొరేటర్ జన్ను షీబారాణి, అనిల్, రాజు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటక ప్రదర్శనలు



'ఉన్నది ఒకటే జీవితం' నాటికలోని సన్నివేశం

వర్ధన్నపేట: భారత నాటక కళాసమితి ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 49వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు రెండో రోజు వర్ధన్నపేట పట్టణంలోని భారతీ నాటక కళాసమితి ఆడిటోరియంలో అలరించాయి. మొదటి నాటిక ప్రదర్శన మయూరి ఆర్ట్స్ వరంగల్ వారి 'ఉన్నది ఒకటే జీవితం' నాటిక ప్రదర్శన ప్రేక్షకులను ఆలోచింపచేసింది. రెండో నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రాజరాజ చోరులు' నాటక ప్రదర్శనను ప్రేక్షకులు మైమరిచి వీక్షించారు.

సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా..



బండా ప్రకాశ్‌ను సన్మానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ: తనకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా హనుమకొండకు వచ్చిన ఆయన ను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. అంతకుముందు ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మడికొండ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం వరకు భారీ స్వాగత ర్యాలీ చేపట్టారు. సన్మాన సభలో బండా ప్రకాశ్ మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డను పార్లమెంట్ మెట్లు ఎక్కించిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో అవసరముందని రాజ్యసభకు రాజీనామా చేయాలని చెప్పగానే వెంటనే చేశానన్నారు. ఎమ్మెల్సీని చేసి నేడు మండలి డిప్యూటీ చైర్మన్‌గా చేయడంతోపాటు దగ్గరుండి బాధ్యతలు స్వీకరింపజేశాడన్నారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. బండా ప్రకాష్ సామాజిక అంశాలు, ఇతర అంశాలపై మంచి పట్టున్న వ్యక్తి అని, మండలి డిప్యూటీ చైర్మన్ పదవికి అన్ని విధాలుగా తగిన వాడని అన్నారు. ఈ పదవి రావడం ఉమ్మడి వరంగల్ జిల్లాకు, ముదిరాజ్‌లకు గర్వకారణమన్నారు. అనంతరం భారీ గజమాల, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆరూరి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజు, కార్పొరేషన్‌ల చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బొలెరో.. కారు ఢీ..

- ఉపాధ్యాయురాలి మృతి
- మరో నలుగురు టీచర్లకు గాయాలు
- హైవే పై ప్రమాదం



జయమ్మ(ఫైల్)



గాయపడిన ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: యాదాద్రి– ఆరెపల్లి ప్రధాన జాతీయ రహదారి మధ్యలో ముచ్చర్ల క్రాస్ వద్ద బుధవారం బొలెరో– కారు ఢీకొన్న సంఘటనలో ఐదుగురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. వీరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన ఓ ఉపాధ్యాయురాలు చికిత్స పొందుతూ మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని గోపాలపురానికి చెందిన చావ బాబు దొర, చావ లక్ష్మీ, నాలి జయమ్మ, పెగడపల్లి డబ్బాలు హనుమాన్‌నగర్‌కు చెందిన మానుపాటి రమేశ్‌బాబు, మానుపాటి (బిజిలి) విజయ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరిలో చావ బాబుదొర, చావ లక్ష్మీ, మానుపాటి రమేష్‌బాబు, విజయలు దంపతులు. బాబు దొర, లక్ష్మీ, మానుపాటి రమేష్‌బాబు, విజయలతో పాటు నాలి జయమ్మ పర్వతగిరి మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. మానుపాటి రమేష్ బాబు మాత్రం వెంకటాపురం మండలంలో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ప్రతి రోజు ఐదుగురు ఉపాధ్యాయులు కలిసి చావ బాబు దొర కారులో పాఠశాలలకు వెళ్తుంటారు. ఇందుకోసం అయ్యే ఖర్చును అందరూ వాటాగా చెల్లిస్తుంటారు. ఇందులోభాగంగా ఐదుగురు కలిసి పెగడపల్లి డబ్బాల నుంచి రింగ్ రోడ్డు మీదుగా బుధవారం పాఠశాలకు బయల్దేరారు. అయితే ముచ్చర్ల వద్ద కారు యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో మణుగూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన జయమ్మ(43), మానుపాటి రమేష్‌బాబు, విజయలకు తీవ్ర గాయాలు కాగా, చావ బాబు దొర, చావ లక్ష్మీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. జయమ్మ చికిత్సపొందుతూ మృతి చెందింది. ఇదిలా ఉండగా.. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనానికి నంబర్ ప్లేట్ లేదు. ఈ వాహనంలో మణుగూర్ నుంచి ప్యాసింజర్లను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లున్న క్రమంలో ఈసంఘటన చోటు చేసుకుంది. చావ బాబు దొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ తెలిపారు.